క్లుప్తంగా

యూజీడీ లీక్‌తో అవస్థలు



చిత్రాలయ థియేటర్ వద్ద పొంగుతున్న యూజీడీ

జగదాంబ : జగదాంబ జంక్షన్‌లోని చిత్రాలయ థియేటర్ వద్ద యూజీడీ లీక్ అవడంతో పరిశుభ్రత లోపించింది. జీవీఎంసీ జోనల్ కార్యాలయం సమీపంలో ఈ యూజీడీ గత కొద్ది రోజులుగా పొంగి పొర్లుతున్నా కనీసం పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే యూజీడీ లీక్‌ను పూర్తిస్థాయిలో అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధుల సంతోషమే లక్ష్యం



సినిమా థియేటర్ వద్ద వృద్ధులు

జగదాంబ : వృద్ధుల సంతోషమే వివేకానంద సంస్థ లక్ష్యమని సంస్థ అధ్యక్షుడు అప్పారావు తెలిపారు. దసరా నేపథ్యంలో ఆశ్రమంలో ఉన్న వృద్ధులను లీలామహల్ థియేటర్‌లో ఆడుతున్న 'భగవంత్ కేసరి'సినిమాకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంతోషం కోసం సంస్థ దేవాలయలు, పర్యాటక కేంద్రాలకు వారిని తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

డాక్యుమెంట్లు ఇచ్చేందుకు నిరాకరణ



జీవీఎంసీ అధికారులను వివరాలు అడుగుతున్న స్థానికులు

సీతమ్మధార : దొండపర్తిలోని కుప్పిలివారివీధి, అల్లూరి వీధి, మండావారి వీధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొంత మేర పోతుందని యజమానులకు జీవీఎంసీ జోన్–5 ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయకుమార్ తెలిపారు. ప్లాన్‌లు, డాక్యుమెంట్లు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన గృహ యజమానులు నోటీసులు ఇవ్వాలని, ఇలా అర్ధంతరంగా వచ్చి డాక్యుమెంట్లు అడగడం సరికాదని స్పష్టం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. జోన్–3లో ఉన్న 27వ వార్డుకు జోన్–5 అధికారులు రావడం కరెక్ట్ కాదని స్థానికులు అంటున్నారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీల కర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టా లతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



నృత్యకారిణులతో నాయకులు

దాబాగార్డెన్స్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో పిల్లలు కూచిపూడి నాట్యం చేశారు.

జగనన్న సురక్షతో.. ఆరోగ్య రక్ష

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 35వ వార్డు వెలంపేట సచివాలయం పరిధిలో ఆరోగ్య తనిఖీలు.. వైద్య సేవలు
- పెద్ద ఎత్తున హాజరైన స్థానికులు

తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనితరసాధ్యమైన సేవలతో డైనమిక్ సీఎంగా పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. 35వ వార్డు వెలంపేట సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పేదలకు అందుతున్న వైద్య సేవలను, పౌష్టికాహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



ఏఎన్‌ఎంలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి



వెలంపేట ఆరోగ్య శిబిరంలో పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఇతర నాయకులు



బంగారుమెట్ట వైద్య శిబిరంలో పేర్లు రిజిస్టర్ చేసుకుంటున్న ప్రజలు

దాబాగార్డెన్స్/జగదాంబ/అల్లిపురం : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న వరం అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట సచివాలయం పరిధిలో సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి మిగతా రాష్ట్రాలకు సీఎం జగన్ ఆదర్శంగా నిలిచారన్నారు. డైనమిక్ ముఖ్యమంత్రిగా పేరుపొందిన జగనన్న ఆరోగ్య సురక్షతో భవితకు బంగారు బాట వేశారన్నారు. చిన్నచిన్న రోగాలకు వార్డుల్లో ఉండే ఆరోగ్య కేంద్రాలు, పెద్ద వ్యాధులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించే విధంగా నాంది పలికారన్నారు. నాడు దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెడితే, తండ్రికి తగ్గ తనయుడైన జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటి సర్వేతో ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారని అన్నారు. మెడికల్ క్యాంప్‌ల ద్వారా ఏడు చికిత్సలు చేసి తక్షణ వైద్యం అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సందేష్, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, సిటీ సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, నాయిని మల్లిబాబు, ఎస్సీ ఎల్ ప్రెసిడెంట్ బోనిదేవా తదితరులు పాల్గొన్నారు.

బంగారుమెట్ట సచివాలయం పరిధిలో..

జీవీఎంసీ 33వ వార్డు బంగారుమెట్ట సచివాలయం పరిధిలో గల వారికి బుధవారం కొబ్బరితోటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జీవీఎంసీ 33,34,35,41 వార్డుల సర్కిల్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠంతో పాటు 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ, పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, భీశెట్టి రాజు పాల్గొని పర్యవేక్షించారు. శిబిరంలో 406 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో నలుగురుని పీడియాట్రిక్ విభాగానికి, ఒకరిని న్యూరాలజీకి, మరొకరిని కార్డియాక్ విభాగానికి కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు, గౌరీవీధి సచివాలయం కార్యదర్శి కిరణ్‌కుమార్, కార్యదర్శులు వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

'జీఎస్టీ సొమ్ము ఏం చేస్తున్నారు?'

దాబాగార్డెన్స్ : జీఎస్టీ ద్వారా నెలకు రూ. ఒకటిన్నర లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వానికి వెళ్తున్నాయని, ఆ సొమ్మును ఏం చేస్తున్నారో తెలపాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ప్రశ్నించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమాయక ప్రజలను ఇజ్రాయిల్ బాంబు దాడులతో చంపుతుంటే.. ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశానికి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఇది జీఎస్టీ వల్లనే అన్నారు. ఈ డబ్బు ఎవరికి వెళ్తుంది? ఏం చేస్తున్నారు? ఎవరికిస్తున్నారో తెలపాలన్నారు.

ముగిసిన శరన్నవరాత్రులు



విశేష అలంకరణలో సాగరగిరి కనకదుర్గమ్మ అమ్మవారు



అల్లిపురంలోని ఒక వీధిలో నిలిపిన దుర్గమ్మ

అల్లిపురం : యారాడ కొండపై వెలసిన శ్రీ సాగరగిరి కనకదుర్గమ్మ దేవాలయంతో పాటు, నియోజకవర్గంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ముఖ్యంగా అల్లిపురంలో దుర్గమ్మను నిలుపుకున్న వారంతా బుధవారం సాయంత్రం అనుపు కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు.

కనుల పండువగా సాగరగిరి దుర్గమ్మ తెప్పోత్సవం..

సాగరగిరి కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా బుధవారం అమ్మవారి తెప్పోత్సవం పోర్టు సాగర జలాల్లో కనుల పండువగా నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని చక్కగా అలంకరించి పల్లకి సేవలో సాగర తీరానికి డప్పు వాయిద్యాలు, కోలాటాలతో తోడ్కొని వచ్చారు. అక్కడ అలంకరించిన పడవలో అమ్మవారు సాగర జలాల్లో విహరించారు.

అలరించిన కథా కచేరీ



కథానిక చదువుతున్న అయ్యల సోమయాజుల ప్రసాద్

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కథా కచేరి అలరించింది. కథకుల స్వీయ కథా పఠనం, వైవిధ్యంతో నిండిన కథలు అందరినీ ఆలోచింపజేశాయి. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు కథకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లని, కథల్లో వివిధ రకాలను వివరించారు. డాక్టర్ కె.జి.వేణు విశిష్ట కథా పరిచయం శీర్షికలో రచయిత ఈతకోట సుబ్బారావు కథానిక ప్రాణం ఖరీదును చక్కగా విశ్లేషించారు. అనంతరం జరిగిన కథా కచేరీలో భాగవతుల సత్యనారాయణమూర్తి కథానిక మానవత్వం ఖరీదు, కె.వి.ఎస్.మూర్తి కథానిక అనసూయమ్మ గారి ఆరోప్రాణం, అయ్యలసోమయాజుల ప్రసాద్ దమయంతమ్మ దసరా పండగ కథానిక, కుప్పిలి భీమేశ్వరరావు దిక్సూచి కథానిక, కొత్తూరి రమణ పెళ్లిపుస్తకం కథానికలు వివిధ అంశాలను సృజించి అలరించాయి. కార్యక్రమంలో సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు, కె.రాంప్రసాద్, వేదుల కామేశ్వరశర్మ, శ్రీనివాస రావు, రాధారాణి పాల్గొన్నారు.

భగవద్గీత సారంపై ప్రవచనం

సీతంపేట: కంచికామకోటి శంకరమఠం, గీతా ప్రచార సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీమద్ భగవద్గీత సారంపై శంకరమఠం ప్రాంగణంలో ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి భగవద్గీత సారంపై ప్రవచనం చేసి దాని విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు, పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రవచిస్తున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య దత్తాత్రేయ శాస్త్రి

వృద్ధ దంపతులకు హెల్త్ క్లబ్ సాయం

మురళీనగర్: మురళీనగర్‌కు చెందిన వృద్ధ దంపతులకు శ్రీనివాసనగర్ వాకర్స్ హెల్త్ క్లబ్ సాయం అందించింది. క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ తరఫున వృద్ధ దంపతుల కుటుంబానికి వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ యు.శుభ నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణ వర్మ, 101 క్యాబినెట్ సెక్రటరీ సీహెచ్ జ్యోతి, వాకర్స్ హెల్త్ క్లబ్ కోశాధికారి ప్రవీణ పాల్గొన్నారు.



వృద్ధ దంపతులకు నిత్యావసర సరకులు అందిస్తున్న శుభ, శ్రీనివాసరాజు

రేషన్ డిపోల్లో తనిఖీలు

కంచరపాలెం: కంచరపాలెం సర్కిల్–1 పరిధి దేవేంద్రనగర్, ధర్మానగర్, రెడ్డికంచరపాలెం రవీంద్రనగర్ ప్రాంతాల్లోని పలు రేషన్ డిపోల్లో బుధవారం సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్–1 ఏఎస్‌వో మురళీధర్ మాట్లాడుతూ రేషన్ సరకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపోల్లో తనిఖీలు చేసి సరకులు, కార్డు హోల్డర్ల వివరాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరకులు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే డిపో లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమణ, లలిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో :

రేషన్ షాపుల్లో పౌర సరఫరాల శాఖాధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలోని రేషన్ దుకాణం–0387204లో తనిఖీలు చేశారు. ఈ దుకాణంలో 45 పంచదార ప్యాకెట్లు, 2 గోధుమ పిండి ప్యాకెట్లు వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామని సర్కిల్–2 చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు అశోక్ తెలిపారు. ఈ మేరకు షాపు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్, భారతి, మురళీ, రామకృష్ణ పాల్గొన్నారు.

అభాగ్యురాలికి సేవలు



అభాగ్యురాలి జుత్తు కట్ చేస్తున్న సూరాడ అప్పారావు

దాబాగార్డెన్స్ : పాత నగరంలో గల స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఓ అభాగ్యురాలిని చేరదీశారు. ఆమె ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజన సమయానికి సంస్థ వద్దకు రావడం.. భోజనం చేసి వెళ్లిపోవడం చేస్తోంది. ఆమె తలంతా కురుపులతో మానసికంగా బాధపడుతున్నట్టు గుర్తించిన ఆయన ఆమె జుట్టు కత్తిరించి సంస్థ మహిళలచే స్నానం చేయించి, ఆ తల పుండ్లకు మందు రాసి సేవలందించారు.

జూలో ఆట పరికరాల ఏర్పాటు



జూ క్యాంటీన్ వద్ద ఆటలాడుతున్న పిల్లలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కుకు వెళ్లే పిల్లలు వన్యప్రాణుల సందర్శనతో పాటు ఎంచక్కా ఆటలాడుకోవచ్చు కూడా. ఇక్కడ వందల సంఖ్యలో వన్యప్రాణులున్నాయి. వాటిని తిలకించడంతో పాటు సరదాగా ఆడుకోవడం కోసం ఇటీవల జూ అధికారులు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. జూలో నీటి ఏనుగుల కొలను ఎదురుగా క్యాంటీన్ పక్కన ఖాళీ స్థలంలో ఊయల, జారుడు బల్లలు, తేగుడు బల్ల తదితర ఆట పరికరాలు ఏర్పాటు చేశారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు



జగన్నాథ స్వామి దేవాలయంలో ప్రశంసా పత్రాలతో చిన్నారులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వ హించారు. ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకించడం ఆనవాయితీ అని ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈవో రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన..

ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్ర ఎరుకుమాంబ ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సిరి డ్యాన్స్ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శ్రీ జగన్నాథస్వామి దేవాలయంలో..

అల్లిపురం : టౌన్ కొత్తరోడ్డు శ్రీ జగన్నాథస్వామి దేవాలయంలో ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా బుధవారం నాల్గవరోజు కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ కళా సంగీత నృత్య నికేతన్ విద్యార్థులు రమాసుందరి, చెట్టి హారిక సాయి నేతృత్వంలో విద్యార్థులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు నృత్యం చేసిన చిన్నారులను అభినందించి, ప్రసంసాపత్రాలతో సత్కరించారు.

ఘనంగా లలితా సుందరేశ్వరుల కల్యాణం

ఏయూ క్యాంపస్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవరసిద్ధి వినాయక లలితాసుందరేశ్వర శక్తి పీఠంలో బుధవారం లోకకల్యాణార్థం శ్రీలలితా సుందరేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించి, తరించారు. అనంతరం సాయంత్రం శ్రీవరసిద్ధి వినాయకునికి ఫల రసాలతో అభిషేకార్చన చేశారు. శ్రీచక్రార్చన, చండీ హోమం, నక్షత్ర దీపాలంకరణ సేవ, మంగళహారతితో బుధవారం కార్యక్రమాలు ముగిశాయి. గురువారం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి అభిషేకం, హోమం చేస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు కాండూరి లక్ష్మణస్వామి తెలిపారు.

మొక్కల పెంపకం.. బృహత్తర కార్యం

- ఏయూలో సొంతంగా నర్సరీ అభివృద్ధి
- అంటు గట్టే విధానంలో మొక్కల వృద్ధి



మొక్కలకు అంటుకట్టిన తర్వాత



తీగజాతి, అలంకరణ మొక్కలు, ఆక్సిజన్ ప్లాంట్స్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మొక్కల పెంపకంపై ఉద్యానవన సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. వర్సిటీలోని పలు కార్యాలయాల వద్ద పెంచడానికి వీలుగా అలంకరణ, ఔషధ, తీగజాతి మొక్కలు, సువాసన అందించే పుష్పాలు కలిగిన మొక్కలను పెంచుతున్నారు. వర్సిటీలో మొక్కల పెంపకం, సంరక్షణకు ప్రత్యేకంగా విభాగం ఉంది. కొద్ది పాటి ఖర్చుతో ఈ విభాగం సిబ్బంది స్వయంగా నర్సరీని తలపించే విధంగా మొక్కల పెంపకం చేస్తున్నారు. దీనిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ స్వయంగా సందర్శించి సిబ్బందిని అభినందించారు.

వర్సిటీ అవసరాలకు తగినట్టుగా..

వర్సిటీలో అలంకరణకు అవసరమైన మొక్కలను పెంచాలని అధికారులు నిర్ణయించారు. దీనికి అవసరమైన కొద్దిపాటి ముడి వస్తువులను కొనుగోలు చేసి హార్టికల్చరల్ పార్క్‌లో విస్తృత స్థాయిలో మొక్కలను పెంచేలా పనులు వేగంగా చేస్తున్నారు.

ఆర్థిక భారం తగ్గుతోంది.. : అలంకరణకు కొనుగోలు చేసే మొక్కలు రూ. 100 నుంచి రూ.500 వరకు ఉంటున్నాయి. తరచూ మొక్కలను కొనడం వర్సిటీకి ఆర్థికంగా భారంగా మారుతోంది. దీనిని తగ్గించడానికి, సొంతంగా వర్సిటీ నిర్వహణకు సిద్ధమైంది. గార్డెనింగ్ విభాగంలో అనుభవం కలిగిన ముగ్గురు వ్యక్తులు ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతూ ఈ మొక్కల పెంపకాన్ని నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ప్లాస్టిక్ కవర్లు, సహజ ఎరువులు కొనుగోలు చేసి వీటిని అంటుకట్టడం, విత్తనాల నుంచి మొక్కలను ఉత్పత్తి చేయడం వంటి విధానాలలో మొక్కలను అభివృద్ధి చేస్తున్నారు. తులసి, షుగర్ ప్లాంట్, పనస, మామిడి వంటి మొక్కలతో పాటు బయట నర్సరీలలో లభించే పదుల సంఖ్యలో క్రోటన్స్ వంటి మొక్కలను ఇక్కడ ఎంతో సులభంగా అభివృద్ధి చేస్తున్నారు.

సర్వాంగ వజ్రకవచధారుడిగా వైభవుడు



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న వాత్సల్య బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వొమ్మి వాత్సల్య బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులకు అలరించాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పరిశీలించారు.